# ఆస్పత్రిలో

"ఏమిటి జబ్బు మీకు ఇంత అర్ధరాత్రివేళ ఆస్పత్రిలో జేరారూ?"

"సూది మింగేశాను. బ్రతుకుతానాండీ. అయ్యో, బ్రతుకుతానా?"

"భయపడకండి. ఫర్వాలేదు. సర్జన్ చాలా తెలివైనవాడు."

"అయ్యో! సూది మింగేశానండీ."

"ఇప్పుడు మీకేమిటి బాధ?"

"బాధేమిటని అడుగుతారేమిటండీ? సూది, సూదిని మింగేశాను. అమాంతంగా చచ్చిపోయేలావున్నాను,"

"ఫర్వాలేదులెండి. కొంచం ఓర్చుకోండి. ఎంతసేపయింది సూది మింగి?"

"ఓ, గంటపైగా అయింది. మీకేమిటి జబ్బు, ఎన్నాళ్లనుంచి మంచం వేస్తున్నా రిక్కడ?"

"నేను సూది మింగలేదు. అది మీబోటిగాళ్లకే సాధ్యం; నేను మింగింది విషం, నిన్న స్మృతిలేకండా పడివుండగా మోసుకొచ్చి పడేశారిక్కడ. అయితే సూది మింగేరా మీరు?"

"మింగేశానండి! అప్పుడే గంటకుపైగా అయింది, అయ్యో నా ప్రాణమా?"

"సాహసమండి! గొప్ప సాహసం! మీరు మింగిందేమిటి తెలుసునాండీ?"

"సూది, సూదండి! భిశాంతరంగా మింగేసి వూరుకున్నాను. హరి దేవుడా, ఎంతపని చేయించావురా నాచేత?"

"సామాన్యమైన పనికాదండి. అఖండ ప్రజ్ఞావంతులుగాని సూది వంటి వస్తువుని మింగలేదు,"

"అయ్యో! నేను మింగేనండీ. నా బ్రతుకుకాలా!"

"అమితసాహసం! సూదంటే సామాన్యమనుకున్నారా?"

"అయ్యో, భయపెట్టకండీ. చచ్చిపోతాను!"

"కాలకూటవిషం మింగినవాడు సామాన్యుడే కావచ్చు. సూది మింగినవాడు మాత్రం?"

"నావంటి దరిద్రుడు మరి పుట్టబోడండి,"

"మీరలా నిరుత్సాహపడకూడదు—మీరు మింగింది సామాన్యమైన వస్తువు కాదు. సూది. ఏమనుకుంటున్నారో గాని, అణువులో బ్రహ్మాండం వుంది. సూదిలో."

"నాముఖముంది! మింగేశాను, అణువునో బ్రహ్మాండాన్నో, దేన్నో వొకదాన్ని! ఇప్పుడేమిటి గత్యంతరం,"

"డాక్టరొచ్చి చెబుతాడు. ఎక్సరే పరీక్షలో దొరికిపోతుంది లెండి శరీరంలో ఏభాగంలో దాక్కున్నాసరే. మహా ప్రళయమైన పని చేశారు."

"మింగేశానండి. సూదినే మింగేశాను. ఇప్పుడేమనుకుంటే ఏం ప్రయోజనం?"

"సామాన్యమానవులకు సూదిని మింగేటంత ధైర్యసాహసాలుండవు. మీరు నిజంగా చాలా గొప్పవారు..."

* * *

పా"పం! అప్పుడే వెళ్ళిపోతున్నారా?"

"ఏమిటిచేసేది? కడుపులో ఎక్కడా సూది లేదంటాడు డాక్టరు."

"ఎంత అదృష్టం!"

"నేను అప్పుడే అనుకున్నానండీ."

"ఏమనీ?"

"నేను సూది మింగలేదనీ, ఏదో అలా భ్రమపడ్డాననీ......"

"మరైతే ఆస్పత్రి కెందుకువచ్చారూ?"

"రాత్రిబండిలో దిగాను. చుట్టాల ఇంటికి దారి తెలిలేదు. ఈరాత్రికి కాస్త ఇక్కడ పడుకోనిస్తారేమోనని..."

"డాక్టరు ఎంత కఠినుడండీ! పొద్దుటిదాకా నేనా ఉణ్ణింగ్చాడు కాడు—"

"పోనీలెండి—వీళ్ళ ఆస్పత్రులే వున్నాయా? వెళ్ళి రైలుస్టేషనులోనే పడుకుంటా తెల్లారీదాకా!"